

అంబులెన్స్.. ప్రైవేటుకే

ప్రభుత్వ, ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్లే కార్పొరేట్ ఆస్పత్రులకు ఏజెంట్లు



- రోడ్డు ప్రమాద బాధితులే టార్గెట్, ప్రభుత్వాస్పత్రిలో బెడ్లు లేవని తరలింపు
- భయాందోళనకు గురిచేసి ప్రైవేటుకు మళ్లిస్తే మొత్తం బిల్లులో 30 శాతం కమీషన్
- రెండు ఆసుపత్రులే కీలకం, ఎక్కువ కమీషన్ వస్తుండటంతో డ్రైవర్ల కక్కుర్తి
- గతంలో మంత్రి దామోదర దృష్టికి తీసుకెళ్లిన ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు

మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రి



మహబూబ్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే, ఎవరైనా ఆపదకు గురైతే మొదటగా గుర్తొచ్చేది అంబులెన్స్. డాక్టర్ వద్దకు వెళ్లి చికిత్స జరుగుతుందనే భావన వచ్చే వరకు అంబులెన్స్ డ్రైవర్ చేతిలోనే జీవితాలు ఉంటాయి. ఎన్నో ప్రాణాలు అంబులెన్స్ డ్రైవర్ల వల్ల నిలబడుతున్నాయి. సమయానికి చికిత్స అందడం వల్ల బాధితులు ఆరోగ్యవంతులుగా మారుతున్నారు. అంబులెన్స్ డ్రైవర్ లేదా అందులో ఉండే ఈఎంటీ (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్)పై నమ్మకం ఉంచుతారు. అలాంటి నమ్మకాన్ని వాడుకొని హైదరాబాద్‌లోని అమీర్‌పేట, ఎల్బీ నగర్ కేంద్రంగా పనిచేస్తున్న రెండు ఆసుపత్రులు అంబులెన్స్ డ్రైవర్ల ద్వారా రోగులను దోచుకునే ఎత్తుగడ వేశాయి. వచ్చే బిల్లులో ఎక్కువ కమీషన్ ఆశచూపి దర్జాగా దందా నిర్వహిస్తున్నారు. వారిని నమ్మి అత్యవసర పరిస్థితుల్లో సదరు ఆసుపత్రుల్లో చేరుతున్న బాధితులు రూ. లక్షల్లో బిల్లులు వేస్తుండటంతో అవాక్కవుతున్నారు. గతంలో ఆరోగ్యమిత్రగా పనిచేసిన ఒక వ్యక్తి అమీర్ పేట్‌లో ఆస్పత్రిని నడిపిస్తూ సుమారు 200 మంది ఏజెంట్లతో అంబులెన్స్ డ్రైవర్లు, కో ఆర్డినేటర్లు, ఈఎంటీలతో మాట్లాడుతూ దందా నిర్వహిస్తున్నారు. ఇదే తరహాలో ఎల్బీనగర్ కేంద్రంగా ఉన్న మరో ఆస్పత్రి కూడా దందా నిర్వహిస్తోంది. గతంలో ఆర్ఎంపీలకు, చిన్నచిన్న పట్టణాల్లో ఉన్న డాక్టర్లకు రోగులను రెఫర్ చేస్తే కమిషన్లు ఇవ్వడం మామూలే. అయితే పేషెంట్‌కు ఇంత అని ముట్టజెప్పేవారు. కానీ ప్రస్తుతం మొత్తం బిల్లుపై 20 శాతం నుంచి 30 శాతం కమీషన్ ఇస్తూ మొదటిగా స్పందించిన అంబులెన్స్ డ్రైవర్లను అస్త్రంగా చేసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాద బాధితులే టార్గెట్..

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 200 కిలోమీటర్ల మేర ఎన్‌హెచ్ 44 రహదారి ఉన్నది. దీంతోపాటు హైదరాబాద్- రాయచూరు, చించోలి జాతీయ రహదారులతో పాటు శ్రీశైలం హైవే, ఇతర రాష్ట్ర రహదారులు ఉన్నాయి. నిత్యం

(మిగతా 6లో..)

మంత్రి దృష్టికి ఎమ్మెల్యేలు..

ఇటీవల మహబూబ్‌నగర్‌లో ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆధ్వర్యంలో నారాయణపేట, మహబూబ్‌నగర్ నారాయణపేట జిల్లాల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు జి. మధుసూదన్‌రెడ్డి, పర్ణికారెడ్డి మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి హైదరాబాద్‌లోని అమీర్‌పేట్‌లో ఉన్న వెల్‌నెస్ ఆసుపత్రి విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అడ్డగోలు బిల్లులు వేస్తూ రోడ్డు ప్రమాద బాధితులను దోచుకుంటున్నారని ఆరోపించారు. నలుగురు కూడా తన నియోజకవర్గంలోని బాధితులు తమకు వచ్చి చెప్పుకున్నట్లు వివరించారు. జూపల్లి కృష్ణారావు ఒక పేషెంట్ కోసం ఏకంగా కోఠిలోని వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ వద్దకు వెళ్లి బిల్లు మాఫీ చేయించుకున్నానని మంత్రి దామోదరకు తెలిపారు. ఉస్మానియాలో బెడ్స్ లేవంటే తాను వెళ్లి చూడగా బెడ్స్ ఉన్నాయని తెలుసుకున్నట్లు నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తెలిపారు. ఒక రోడ్డు ప్రమాద బాధితుడిని అంబులెన్స్ డ్రైవర్లు వెల్‌నెస్ ఆస్పత్రికి తీసుకెళ్తే రూ. 10 లక్షల బిల్లులు వేశారని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఎమ్మెల్యేలు నేరుగా జోక్యం చేసుకుంటే తప్పా ఈ దోపిడీని ఆపని పరిస్థితులు ఉన్నాయి. పూర్తి బిల్లులో 30 శాతం వరకు కమీషన్లు ముట్టజెప్పుతుండటంతో అత్యాశకు పోయి బాధితులను అప్పుల ఊబిలోకి నెట్టేస్తున్నారు. రోడ్డు ప్రమాద బాధితుడి ఫస్ట్ అవర్ భయాందోళనను క్యాష్ చేసుకుంటున్నారు.

20 ఏళ్లకు సరిపడా విద్యుత్ ఉత్పత్తికి ప్రణాళికలు

- పంపుడ్ స్టోరేజీని వినియోగంలోకి తేవాలి
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



అధికారులతో సమీక్షలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

కొల్లాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : హైడల్ పవర్‌తో పాటు పంప్‌డ్ స్టోరేజ్‌తో విద్యుత్ ఉత్పత్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గంలోని సోమశిల లలితాంబిక సోమేశ్వర ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జెన్‌కో, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాల నుంచి పులిచింతల వరకు కృష్ణానది మీద ఉన్న హైడల్ పవర్ ప్రాజెక్టులను సమీక్ష చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అవసరమైతే ప్రపంచ పేరుగాంచిన కన్సల్టెంట్‌ల సేవలను ఉపయోగించుకోవాలని సూచించారు. సోలార్ ద్వారా పగలు జరిగే ఉత్పత్తిని స్టోరేజ్ చేసి రాత్రివేళ ఉపయోగానికి అవసరమైన సాంకేతికతను దానికి అవసరమైన స్టోరేజ్ వ్యవస్థను రూపొందించుకోవాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 1978లోనే ముందు చూపుతో అత్యాధునికమైన సాంకేతికతను పరిచయం చేసిందని తెలిపారు. రాబోయే తరాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ హితమైన పవర్‌ను ఉత్పత్తి చేసి అందించాలని అధికారులకు సూచించారు. ఈ ఏడాది నిరంతరాయంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యుత్‌ను అందించిన సిబ్బందిని అభినందించారు. సీఎండీ నుంచి కింది స్థాయి సిబ్బంది దాకా వారికి అవసరమైన సాంకేతికతను పెంపొందించుకోవడానికి అవసరమైన సిలబస్ రూపకల్పనతో పాటు అవసరమైన నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. గ్రీన్ హైడ్రోజన్, ఫ్లోటింగ్ సోలార్, రూఫ్ సోలార్, థర్మల్ పవర్, పవన విద్యుత్, అణు విద్యుత్ బ్యాటరీ స్టోరేజ్ లాంటి ప్రత్యామ్నాయ విద్యుత్ కోసం వినియోగాన్ని ఎక్కువ మొత్తంలో అభివృద్ధి చేసుకోవాలని అన్నారు.

వనపర్తి విద్యార్థికి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు

7

రెండు బైకులు ఢీ- ఒకరు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : రెండు బైకులు ఢీకొని ఒక వ్యక్తి పుట్టం ప్రవీణ్(25)మృతి చెందినట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని నెల్లికొండ చౌరస్తా సమీపంలో శనివారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ప్రవీణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శనివారం అర్ధ రాత్రి మృతి చెందాడు. ఈ సంఘటనపై మృతుని మామ ఆవుల రమణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు పట్టాలపై పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

- నారాయణపేట జిల్లా కృష్ణ రైల్వే బ్రిడ్జి వద్ద ఘటన
- మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి మృతదేహం తరలింపు

7

డ్రాగన్ ఫ్రూట్స్.. లాభాలు ఫుల్లు!

- 4 ఎకరాల్లో సాగు
- రూ.12 లక్షల ఆదాయం

శేరిఅప్పారెడ్డిపల్లిలో రైతు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోట



7

రోడ్డెక్కిన నిర్వాసితులు

- బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని రాస్తారోకో



నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి

- 400 యూనిట్లను అధిగమించిన ఉత్పత్తి

మహిళ ఆత్మహత్య

- కుమార్తెను దుకాణానికి పంపించి అఘాయిత్యం

మహబూబ్‌నగర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని బండమీదిపల్లికి చెందిన లక్ష్మి (35) ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ కలహాలతో ఇంట్లోనే ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. భర్త డీఆర్‌డీఏలో పని చేస్తున్నాడు. వీరికి కూతురు, కొడుకు ఉన్నారు. ఇంట్లో ఆత్మహత్యకు ప్రయత్నించగా, గమనించిన పదమూడేళ్ల కూతురు తల్లిని వారించింది. కాసేపైన తరువాత కూతురును దుకాణానికి పంపించి, ఆమె వెళ్లగానే ఫ్యాన్‌కు ఉరేసుకుంది. వచ్చేసరికి ఉరేసుకుని కొట్టుమిట్టాడుతున్న తల్లిని చూసి భయపడిన కూ తురు తండ్రికి ఫోన్ చేసింది. కిందికి దిం చాలని తండ్రి చెప్పగా, దించే ప్రయత్నం చేసినా ఆమె వల్ల కాలేదు. ఇరుగు పొరుగు వారిని పిలువగా, వారు వచ్చి కిందికి దించే వరకు ఆమె మరణించింది.

నీటిగుంతలో వ్యక్తి మృతదేహం లభ్యం

- ఉదండాపూర్ రిజర్వాయర్ గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లి మృతి
- నవాబ్‌పేట మండలం సిద్దోటం గ్రామానికి చెందిన వ్యక్తి గా మిస్సింగ్‌గా అనుమానం

7

విద్యార్థులకు వైద్య పరీక్షలు

- అంగన్‌వాడీ నుంచి హైస్కూల్ వరకు
- 'మిషన్-100 డేస్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- వైద్య పరీక్షల అనంతరం అవసరాన్ని బట్టి పౌష్టికాహారం
- ఆదేశాలు జారీ చేసిన మంత్రి సీతక్క



గతేడాది ధరూరు పాఠశాలలో వైద్య పరీక్షల అనంతరం సూచనలు చేస్తున్న సిబ్బంది

అయిజ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) నేటి కాలంలో వారసులకు ఆస్థి కంటే ఆరోగ్యమే ముఖ్యమనే భావన చాలామంది పిల్లల తల్లిదండ్రులో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగన్‌వాడీ స్థాయిలో నుంచి హైస్కూల్ స్థాయి వరకు విద్యార్థులకు రక్త పరీక్షలతో పాటు, వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ మేరకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని గత వారం రోజుల క్రితం అధికారులను ఆదేశించారు. ఉత్తరప్రదేశ్, బీహారు లాంటి రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రంలోని పిల్లల్లో వయసుకు తగ్గ ఎదుగుదల లేకపోవటం, రక్తహీనత ఉన్నట్లుగా ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లుగా తెలుస్తోంది. పిల్లల ఆరోగ్య పరిస్థితులపై ఎప్పటికప్పుడు గ్రోత్ స్టేటస్ పేరుతో ప్రతీ విద్యార్థికి ప్రతీనెల 'గ్రోత్ ప్రోగ్రెస్ రిపోర్టు' ను తయారు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేసింది.

గద్వాల జిల్లాలో ఇలా..

జోగుళాంబ గద్వాల జిల్లాలో 713 అంగన్‌వాడీ కేంద్రాల్లో 42,496 మంది చిన్నారులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యాభ్యాసం కొనసాగే 507 ప్రభుత్వ పాఠశాలల్లో 68 వేల మంది విద్యార్థులు ఉన్నారు. వీరందరికి కూడా 'మిషన్-100 డేస్' పేరుతో ప్రత్యేక హెల్త్ క్యాంపులను ఆయా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు చేయాలని నిర్ణయించారు. ఈ పరీక్షల్లో వచ్చిన రిపోర్టుల ఆధారంగా పౌష్టికాహారం అందించనున్నట్లు తెలుస్తోంది.

2022లో గద్వాల జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రత్యేక చొరవతో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. 29,376 మంది చిన్నారులకు ఎత్తుకు తగ్గ బరువు పరీక్షలు నిర్వహించగా 74.01 శాతం సాధారణ ఎత్తు, 20.12 శాతం తక్కువ ఎత్తు, 05.87 శాతం అతితక్కువ ఎత్తు ఉన్నట్లు తేలింది. వయసుకు తగ్గ ఎత్తు పరీక్షలను 27,986 మంది చిన్నారులకు నిర్వహించగా సాధారణ ఎత్తు 54.36 శాతం, తక్కువ ఎత్తు 25.90 శాతం, అతి తక్కువ ఎత్తు 19.74 శాతం ఉన్నట్లుగా రుజువు అయ్యింది. పోషకాహార పరీక్షలను 28,971 మంది చిన్నారులకు చేయగా అందులో సాధారణలోపం 92.34 శాతం, లోపం కొద్దిగా 4.88 శాతం, లోపం తీవ్రంగా 2.78 శాతం ఉన్నట్లుగా తేలింది. అప్పట్లో వీరందరికి బాలామృతం ప్లస్ ఫుడ్‌ను ప్రత్యేకంగా అందించే ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం 'మిషన్-100 డేస్' పేరుతో ప్రత్యేక హెల్త్ క్యాంపులను నిర్వహించనున్నది.

వైద్య పరీక్షలు అవసరమే..



ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలనే నిర్ణయం మంచిదే. కంటి సమస్య, రక్త హీనత, ఎత్తుకు తగ్గ బరువు, వయసుకు తగ్గ బరువు లేని వారు చాలా మంది ఉన్నారు. వారందరికి ఈ పరీక్షలతో మేలు జరుగుతోంది.

- వీరేశ్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, చింతలకుంట, (కేటీదొడ్డి)



నాయినోనిపల్లి మైసమ్మదేవతను దర్శించుకుంటున్న భక్తులు

మైసమ్మ దేవతకు పూజలు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి):నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని నాయినోనిపల్లి గ్రామ శివారులో వెలిసిన మైసమ్మ దేవతకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి జిల్లా నలుమూలల నుంచి కాకుండా తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల నుంచి మైసమ్మ ఆలయానికి టికెట్ల ద్వారా రూ.75,440, హుండీ ద్వారా రూ.73,993, మొత్తం 1,49,433 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈవో రామేశ్వరశర్మ, చైర్మన్ శ్రీనివాస్‌యాదవ్‌లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఆనందం

- ఎస్పీ రావుల గిరిధర్



విజేతలతో ఎస్పీ రావుల గిరిధర్, జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసిక ఆనందాన్ని ఇస్తాయని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. ఆదివారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా స్థాయిలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న చదరంగం పోటీల విజేతలకు ఆయన బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... చదరంగం లాంటి ఆట మేధాశక్తిని పెంచడమే గాక మెదడుకు పదును పెడుతుందని అన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, నిర్వాహకులు యాదగిరి, కృష్ణయ్య, గణేష్‌కుమార్, నరసింహ, వేణుగోపాల్, విద్యార్థులు చదరంగం క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకే అంబులెన్స్

5వ పేజీ తరువాయి

ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరగడం పరిపాటి. అలాంటి రోడ్డు ప్రమాద బాధితులకు మొదట గుర్తొచ్చేది అంబులెన్స్‌లు. ముఖ్యంగా 108కి మొదట ఫోన్ వెళుతుంది. వారు నేరుగా మహబూబ్‌నగర్‌లోని జనరల్ ఆస్పత్రికి తరలించిన తర్వాత అక్కడి నుంచి తతంగం ప్రారంభమవుతుంది. ఒకవేళ పేషెంట్‌కు సీరియస్‌గా ఉంటే అక్కడే 108 లేదా ప్రైవేటు అంబులెన్స్‌లలో ఉస్మానియా, గాంధీ, నిమ్స్‌కు తరలిస్తారు. కొందరు రోగులు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తారు. అయితే వారు ఉస్మానియాకు వెళుతున్న మార్గంలో లేదా అక్కడికి వెళ్లిన తర్వాత " నిన్ననే వచ్చాను ఇక్కడ బెడ్స్ ఖాళీ లేవు.. లేదా ఇలాంటి స్థితిలో పేషెంట్‌ను తెస్తే నిన్ననే చనిపోయారు.. ఇక్కడ ఈ విభాగంలో వైద్య సౌకర్యాలు లేవు.. డాక్టర్లు కూడా అందుబాటులో లేరు.. సరిగా చూసుకోరు" అని భయాందోళనకు గురిచేస్తారు. "నాకు తెలిసిన ఆస్పత్రిలో ఇలాంటి కేసులు బాగా చూస్తారు. తీసుకెళ్దాం.. తక్కువ కూడా తీసుకుంటారు" అని చెప్పి నమ్మిస్తారు. 108 అంబులెన్స్‌ల వారు అయితే వారి కో ఆర్డినేటర్‌తో మాట్లాడి బాధితుడి బంధువులు ప్రైవేటుకు తీసుకెళ్లాలని ఒత్తిడి చేస్తున్నారు. అంటే ఎమర్జెన్సీ కాబట్టి తీసుకెళ్లమని చెబుతున్నారు. ఒకవేళ ప్రైవేటు అంబులెన్స్ అయితే సదరు డ్రైవర్ బాధితుడి బంధువులను భయాందోళనకు గురిచేసి ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తారు. ఒకవేళ తనకు వారిని మేనేజ్ చేయడం కుదరకపోతే ఉస్మానియా లేదా గాంధీకి వెళ్లే సరికి సదరు ఆస్పత్రి ఏజెంట్‌ను అందుబాటులో ఉంచుతారు. ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్‌కు అయితే 30 శాతం, ప్రభుత్వ అంబులెన్స్ డ్రైవర్‌కు 20 శాతం కమీషన్ మొత్తం బిల్లుపై ఇస్తున్నారు.

కవుల డైరెక్టరీ అభినందనీయం

- జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి
- విజయవంతమైన కవుల డైరెక్టరీ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ న్యూ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పాలమూరు జిల్లా కవులు తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో కవులు, రచయితల డైరెక్టరీని వెలువరించడంలో ఆ బృందం చేసిన కృషి అభినందనీయమని కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది మనోహర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వాగ్దేవి జూనియర్ కళాశాల ఆడిటోరియంలో తెలంగాణ సాహితి ఆధ్వర్యంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కవుల, రచయితల డైరెక్టరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గతంలో సురవరం ప్రతాప్ రెడ్డి వెలవరించిన గోల్కొండ కవుల సంచికను ఈ డైరెక్టరీ గుర్తుకు తెస్తోందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న సుమారు 240 మందిని గుర్తించి, ఇలా డైరెక్టరీని ప్రచురించడం సాహసోపేతమైన చర్యగా అభివర్ణించారు. కవులు సామాజిక సమాజాన్ని చైతన్య పరిచే విధంగా మరింత విస్తృతంగా రచనలు చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ సాహితి రాష్ట్ర అధ్యక్షుడు వల్లభాపురం జనార్దన అభిప్రాయపడ్డారు. కవుల డైరెక్టరీని వెలువచించడంలో ఎదుర్కొన్న ఇబ్బందులు, అధిగమించిన తీరును తెలంగాణ సాహితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖాజామైనోద్దీన్, కొప్పోలు యాదయ్య వివరించారు. కార్యక్రమం ప్రారంభంలో చిన్నారి మేఘన చేసిన నృత్యం ఎంతగానో అలరించింది. తెలంగాణ సాహితి సలహాదారుడు పరిమళ్, ఉపాధ్యక్షుడు బాదేపల్లి వెంకటయ్యగౌడ్, కార్యదర్శులు కాళిదాసు, ప్రమోద్‌కుమార్, ఉమ్మడి జిల్లా కవులు, రచయితలు పాల్గొన్నారు.



కవుల డైరక్టరీని ఆవిష్కరిస్తున్న వక్తలు

మార్కెట్ చెక్‌పోస్టు తనిఖీ


చెక్‌పోస్టు రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కార్యదర్శి చంద్రశేఖర్

కృష్ణ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కృష్ణ మండలం గుడెబల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని మార్కెట్ చెక్‌పోస్టును మార్కెట్ యార్డు కార్యదర్శి చంద్రశేఖర్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు సాగు చేసిన వ్యవసాయ పంటలు, ఉత్పత్తి సరుకులు రవాణా చేసే వాహనాల నుంచి నూటికి ఒక పర్సంటేజ్ వసూలు చేస్తున్నామని తెలిపారు. చెక్‌పోస్టు ద్వారా ఈయేడాది ఏప్రిల్ నుంచి జూలై నెల వరకు రూ.కోటి 17 లక్షల 49 వేల 952 ఆదాయం సేకరించినట్లు చెప్పారు. ఇప్పటివరకు ఇంతమొత్తంలో ఆదాయం సమకూరలేదని కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు.

గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దు

- ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దని నారాయణపేట ఎస్పీ యోగేష్‌గౌతమ్ ఆదివారం పేర్కొన్నారు. ప్రజల సొమ్ము దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు రోజురోజుకి కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకునేందుకు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారన్నారు. మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనలతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవల్ మార్కెటింగ్ స్కీముల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలను అధికంగా మోసం చేస్తున్నారన్నారు. ఎక్కువ మందిని ఏజెంట్లను చేర్పించి ప్రజల నుంచి డబ్బులు సేకరించి ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అత్యాశకు పోయి మోసపోవద్దన్నారు. ఆర్థిక మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు.

కామన్ స్కూల్ విధానాన్ని అమలు చేయాలి

- టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ
- 10న నిర్వహించనున్న టీపీటీఎఫ్ విద్యా సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నారాయణమ్మ అన్నారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాయలంలో డీఈవో ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఈనెల 10న జరిగే టీపీటీఎఫ్ విద్యా సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఏకీకృత సర్వీస్ రూల్, సీపీఎస్ రద్దు, పీఆర్సీ అమలు, పెండిగ్‌లో ఉన్న డీఏల సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కుబేర్ బిల్లు పెండింగ్‌ను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహమూద్, నవీన్, రెడ్డప్ప, దేవేంద్రప్ప, లక్ష్మీకాంత్, వెంకట్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కురుమూర్తి

లేబర్ కోడ్‌ల రద్దుకు రాజీలేని పోరాటం

- కార్మికులకు ఉరికొయ్యలుగా మారిన లేబర్‌కోడ్‌లు
- సీఐటీయూ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, కురుమూర్తి
- ముగిసిన జిల్లా రాజకీయ శిక్షణ

జడ్చర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్‌ల రద్దుకు రాజీలేని పోరాటం చేద్దామని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దీప్లానాయక్, కురుమూర్తి పిలుపునిచ్చారు. జడ్చర్లలోని అంబేడ్కర్ కళాభవన్‌లో సీఐటీయూ జిల్లా రాజకీయ శిక్షణ రెండు రోజులు కొనసాగగా, ఆదివారం ముగింపు కార్యక్రమానికి ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రం తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లు కార్మికులకు ఉరికొయ్యలుగా మారాయన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులతో దినసరి కూలీలుగా పనిచేయించుకుని కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీ కల్పించడంలేదని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో 8 గంటల పనిని 10, 12, 14 గంటలుగా అమలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్‌లకు, పెట్టుబడిదారులకు కార్మికులను బానిసలుగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కురుమూర్తి, సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య, వస్యాబేగం, చంద్రకాంత్, రాజ్‌కుమార్, గాలన్న, ఖమర్‌అలి, కురుమూర్తి, వెంకటేశ్‌గౌడ్, చెన్నయ్య, కృష్ణయ్య, బాలనాగయ్య, శేఖర్‌రెడ్డి, రమేశ్, మల్లేష్ పాల్గొన్నారు.

తైక్వాండోలో క్రీడాకారులు ప్రతిభ చాటాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తైక్వాండో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలుర కళాశాల మైదానంలో ఆదివారం విద్యార్థులకు తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్ బాబు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని, తైక్వాండో గుర్తింపు ఉన్న క్రీడ అన్నారు. తైక్వాండో జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించారని గుర్తుచేశారు. బెల్టు గ్రేడింగ్‌లో 14 మంది వివిధ విభాగాల్లో బెల్టులు సాధించినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు సాయిలు, కోశాధికారి శంకర్, సీనియర్ కోచ్ రాజు పాల్గొన్నారు.


తైక్వాండోలో బెల్టులు సాధించిన విద్యార్థులతో సురేందర్‌బాబు

యోగాతోనే ఆరోగ్యం



యోగా విద్యార్థులతో అధికారులు

నారాయణపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మానవాళికి ఆరోగ్యం యోగా ద్వారా సాధ్యమని డీఈవో గోవిందరాజులు అన్నారు. ఆదివారం జిల్లా స్థాయి యోగా ఎంపికలు నారాయణపేట సిటిజన్ క్లబ్‌లో యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవోతో పాటు, డీఎంహెచ్ వో జయచంద్రమోహన్ హాజరై ప్రసంగించారు. యోగా వల్ల విద్యార్థులు మానసిక ఏకాగ్రత, శారీరక ధృఢత్వాన్ని పొందుతారన్నారు. జిల్లా వ్యాప్తంగా 120 మంది విద్యార్థులు, యువజన యోగా క్రీడాకారులు పాల్గొని, తమ యోగాసన నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో బాలాజీ, జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్, జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్, పతంజలి యోగా సమితి అధ్యక్షుడు సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు, యోగా శిక్షకులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయికి సబ్ జూనియర్స్ విభాగంలో సాయిచరణ్, విఘ్నేష్, చరణ్‌తేజ, వనజ, లావణ్య, హారిక, నందిని, పార్వతి, సృజన, సీనియర్స్ విభాగంలో బాలకృష్ణ, సూర్యప్రకాష్, వెంకటేష్, మల్లికార్జున్, రజిత, ప్రసన్న, రజినీ ఎంపికయ్యారు.

నేడు చెన్నిపాడులో వేప, రావి చెట్లకు వివాహం

మానవపాడు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని చెన్నిపాడు గ్రామంలో సోమవారం వేప చెట్టుకి, రావి చెట్టుకు పెళ్లి వేడుక చేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వాల్మీకి కట్ట దగ్గర వేపచెట్టు, రావి చెట్టు పక్క పక్కనే ఉండటంతో వాటికి పెళ్లి వేడుకలు చేయాలని దీంతో గ్రామంలోని రైతులు, వ్యాపారులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉంటారనే నమ్మకంతోనే ఈ కార్యక్రమం చేస్తున్నట్లు వివరించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో సీపీఐ కార్యకర్త కేశంపేట శ్రీనివాసులు కుటుంబానికి పార్టీపరంగా రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. కేశంపేట శ్రీనివాసులు ఈ నెల 1న కల్వకుర్తిలో జరిగిన ఆ పార్టీ బహిరంగ సభలో గుండెపోటుకు గురై మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాలనరసింహ, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్‌లు ఆదివారం బాధితుడి ఇంటికెళ్లి శ్రీనివాసులు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాలనరసింహ మాట్లాడుతూ మరణించిన పార్టీ కార్యకర్త కుటుంబ సభ్యులకు సీపీఐ తరపున అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో దేవునితిర్మలాపూర్ మాజీ సర్పంచ్ గడ్డిగోపుల హుస్సేన్, సీపీఐ జిల్లా కౌన్సిల్ మెంబరు ఏసయ్య, సీపీఐ మండల కార్యదర్శి బొల్లెద్దుల శ్రీనివాసులు, సహాయ కార్యదర్శి లక్ష్మీనారాయణ, నాయకులు టి.నరసింహ, తలారి లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

తెలకపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని కాంగ్రెస్ నాయకుడు, రిటైర్డ్ టీచర్ పర్వతాలును ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి ఆదివారం వారింట్లో పరామర్శించారు. మండలంలో కాంగ్రెస్ క్రియాశీలకంగా పనిచేస్తున్న నాయకుడు అనారోగ్యంతో బాధపడుతున్నారు. దాంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ బండ పర్వతాలు, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మీ, మాజీ సర్పంచ్ గౌడ్, జిలాని తదితరులు ఉన్నారు.

జిన్‌కుంట లెదర్ పార్కును ప్రారంభించాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ

కల్వకుర్తి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తెలకపల్లి మండలంలోని జిన్‌కుంటలో లెదర్ పార్కును వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ డిమాండ్ చేశారు. ఆదివారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాగర్‌కర్నూల్ జిల్లా మూడవ మహాసభలు విజయవంతం చేసినందుకు ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పి.పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ మహిళలకు ఆర్థిక భరోసా

- ఇందిరమ్మ మహిళా శక్తి పథకానికి 784 దరఖాస్తులు
- పంపిణీకి సిద్ధంగా ఉన్న 300 కుట్టు మిషన్లు

గద్వాల సర్కిల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ నిరుద్యోగ మహిళలకు ఆర్థిక భరోసా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. అందులో భాగంగానే గతేడాది మైనారిటీ మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు ఇందిరమ్మ మహిళా శక్తి ఉచిత కుట్టు యంత్రాల పథకానికి శ్రీకారం చుట్టింది. అందుకుగాను అర్హులైన వారి నుంచి గతేడాది డిసెంబర్ 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. కుట్టు మిషన్ల పంపిణీ కొన్ని అనివార్య కారణాలతో నిలిచిపోయినప్పటికీ ప్రస్తుతం వాటిని ఎంపికైన వారికి పంపిణీ చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం సన్నద్ధమైంది.

జిల్లాకు 300 కుట్టు మిషన్లు

జిల్లాలో మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి పథకంలో భాగంలో అర్హత గల వారికి పంపిణీ చేసేందుకు 300 కుట్టు మిషన్లు సిద్ధంగా ఉన్నాయి. అయితే గద్వాల నియోజకవర్గానికి 150, అలంపూర్ నియోజకవర్గానికి 150 ఉచిత కుట్టు మిషన్లు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.


గద్వాలలో పంపిణీకి సిద్ధంగా ఉన్న కుట్టు మిషన్లు

784 మంది దరఖాస్తు

కుట్టు మిషన్లు పొందేందుకు 5వ తరగతి కనీస విద్యార్హతతో పాటు 18 నుంచి 55 సంవత్సరాల వయసు ఉన్న వారికి అవకాశం ఇవ్వడంతో పోటీ పెరిగింది. జిల్లా వ్యాప్తంగా 784 మంది మహిళలు దరఖాస్తు చేసుకోగా, వాటిలో గద్వాల నియోజకర్గం నుంచి 602 మంది, అలంపూర్ నియోజవర్గం నుంచి 182 మంది దరఖాస్తులు వచ్చాయి.

ఆర్థిక సాధికారత కోసం



మైనారిటీ నిరుద్యోగ మహిళలు ఆర్థిక సాధికారత సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆర్థిక పరిస్థితి, అర్హత తదితర అంశాల ఆధారంగా లబ్ధి దారులను ఎంపిక చేశాం. జిల్లాకు వచ్చిన 300 ఉచిత కుట్టు మిషన్లను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. త్వరలో తేదీ ప్రకటిస్తాం.

-ముషిత, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖాధికారి, గద్వాల

ఇంటి తాళాలు పగులగొట్టి చోరీ

- రెండు తులాల బంగారు గొలుసు అపహరణ

నాగర్‌కర్నూల్ క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని నాగనూల్ రోడ్డులో గల జోషి కల్యాణ్‌శర్మ ఇంట్లో దొంగతనానికి పాల్పడి రెండు తులాల బంగారు గొలుసు చోరీ చేసుకుని వెళ్లినట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. జూలై 28న జోషి కల్యాణ్‌శర్మ ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో ఊరికి వెళ్లారు. శనివారం ఇంటికి వచ్చి చూసుకునే సరికి తాళాలు పగులగొట్టి దొంగతనానికి పాల్పడినట్లు గుర్తించారు. ఈ సంఘటనపై జోషి కల్యాణ్‌శర్మ ఆదివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

టిప్పర్ పట్టివేత

ఊర్కొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : టిప్పర్ పట్టుకొని సీజ్ చేసిన సంఘటన మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం.. కల్వకుర్తి వైపు నుంచి ఇసుక నింపుకొని మండలంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారి గుండా వెళ్తున్న ఇసుక టిప్పర్‌కు సరైన కాగితాలు లేనందున దానిని కల్వకుర్తి ఎంవీఐ పట్టుకొని ఊర్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారని ఎస్ఐ పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా అడుగులు వేయాలి

- రాష్ట్ర బీజేపీ కోశాధికారి బండారి శాంతికుమార్

తిమ్మాజిపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా అడుగులు వేయాలని రాష్ట్ర బీజేపీ కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తిమ్మాజిపేట మండల పరిధిలోని మరికల్‌లో ఆదివారం ఇంటింటికి బీజేపీ ప్రతి ఇంటికి పోలింగ్ బూత్ అధ్యక్షుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నాయకులతో కలిసి ప్రతి ఇంటికెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ కార్యకర్త ఇంట్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా ఉంటూ ప్రపంచంలోనే మన దేశాన్ని అగ్రగ్రామిగా నిలిపిన ఘనత నరేంద్రమోడీకే దక్కుతుందన్నారు. ప్రతి నెల అందిస్తున్న ఉచిత బియ్యం, రైతు కిసాన్‌సమ్మాన్ నిధి నుంచి రూ. 2000 వేలు అందిస్తూ మరుగుదొడ్ల నిర్మాణం ఉచితంగా గ్యాస్ కనెక్షన్స్ స్మశాన వాటికలు, పల్లె ప్రకృతి వనాలు, వీధి దీపాలు, సీసీ రోడ్లు వంటి మరెన్నో కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామాలల్లో ప్రజలకు వివరించాలని అందరూ బాధ్యతగా పని చేస్తూ గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ గ్రామాగ్రామాన బీజేపీ అభ్యర్థులు అధికారంలోకి రావాలన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు జెట్టి వెంకటేశ్, నాగేందర్‌గౌడ్, వేణుగోపాల్, నారాయణ చారి, డాక్టర్ శివలింగం, యాదిలాల్, నీలాకృష్ణ తదితరులు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీజేపీ కోశాధికారి బండారి శాంతికుమార్

ఘనంగా సీతారాముల మాస కల్యాణం


స్వామి వారి మాస కల్యాణంలో పాల్గొన్న భక్తులు

చారకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరసనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయంలో సీతారామచంద్ర స్వామి మాస కల్యాణ వేడుకను ఆదివారం ఆలయ చైర్మన్ ధేరం రామశర్మ, ఈవో స్వర్గం ఆంజనేయులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన రఘువీర్‌కుమార్, భువనేశ్వరి దంపతులు పాల్గొని స్వామి వారికి మాసకల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వివిధ రకాల పూలతో స్వామి వారిని అలంకరించి అభిషేకం, పంచామృతాభిషేకం, తులసీనామార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నిరంజన్, ఆలయ అర్చకులు ధేరం మురళీధర్‌శర్మ, ధేరం లక్ష్మణశర్మ, ధేరం అనంతరామశర్మ, ధేరం కోదండరామశర్మ, భక్తులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యానికి నిధులు

హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు


ఊర్కొండపేటలో బోరు డ్రిల్ చేయిస్తున్న దృశ్యం

ఊర్కొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తాగునీటికి ఇబ్బందులు పడుతున్న గ్రామాలకు బోరు బావులు తవ్వేందుకు స్థానిక ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి నిధులు మంజూరు చేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండలంలోని ఊర్కొండపేట గ్రామంలో బోరు బావి డ్రిల్ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ యువజన విభాగం మండల మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నీటి ఎద్దడి ఉందని తెలియజేసిన వెంటనే ఎమ్మెల్యే నిధులు మంజూరు చేశారని వారికి ధన్యావాదాలు తెలియజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అభయాంజనేయ స్వామి వారి ధర్మకర్తల మండలి సభ్యుడు రమేష్, నాయకులు వహీదొద్దీన్, మొండేళ్ల కృష్ణ, జంగయ్య, పాపయ్యగౌడ్ ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 మందిపై కేసు నమోదు

గద్వాల క్రైం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ బాల చంద్రుడు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డ్యాంరూట్‌లో వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలను నడిపిన 15 మందిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు.

క్రైం కార్నర్

రైలు పట్టాలపై పడి
గుర్తు తెలియని వ్యక్తి మృతి

కృష్ణ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రైలు పట్టాలపై పడి గుర్తు తెలియని వ్యక్తి (50) మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణ మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో కృష్ణ రైల్వే బ్రిడ్జి వద్ద ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి రైలు పట్టాలపై పడి తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందిన వ్యక్తి సమాచారం అందించారు. దీంతో సంఘటన స్థలానికి సత్యనారాయణ రాజు చేరుకుని వివరాలు సేకరించి ఉమ్మడి పాలమూరు రైల్వే ఎస్ఈ రాజు సమాచారం అందించి గుర్తు తెలియని మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అన్నారు. మృతి చెందిన ఎలాంటి ఆనవాళ్లు, ఆధారాలు లేవని ప్లంబర్ దుకాణాల ఎస్టిమెట్ వేసుకున్న రెండు బిల్లులు, రూ.230 డబ్బులు మాత్రమే ఉన్నాయి. మెడలో పూసల హారం, మిక్స్ బ్లూ షర్ట్, వైట్ ప్యాంట్ దుస్తులు ధరించి ఉన్నాడు. సంబంధించిన వారు ఈ వ్యక్తి గురించి ఆచూకీ తెలిసిన వారు మహబూబ్ నగర్ ఎస్ఐను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

తెలకపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన శివ, ప్రశాంత అనే యువకులు ఇంటి దగ్గర నుంచి షాప్ దగ్గరికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో శివ అనే యువకుడికి తీవ్ర గాయాలు కాగా, ప్రశాంత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దాంతో అతన్ని నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తీసుకెళ్లగా, డాక్టర్ల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు.

దొంగతనాన్ని ఛేదించిన పోలీసులు

» రూ. 41 వేలు, ఆటో స్వాధీనం, నిందితులు అరెస్టు

ఇటిక్యాల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో దొంగతనం చేసిన వారిని పట్టుకొని, వారి నుంచి నగదు, సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఉమ్మడి ఇటిక్యాల మండలంలో గత నెల జూలై 19న ఎర్రవల్లిలోని బీకేఎస్ ట్రేడర్స్, సుధాకర్ ఇంజనీరింగ్ షాప్, వెంకటేశ్వర ట్రేడర్స్‌లలో గుర్తు తెలియని వ్యక్తులు పైకప్పు రేకులు తొలగించి అందులో రూ.12,500, మొబైల్, శాంసంగ్ ట్యాబ్, 3కేజీల రాగి రేకులు, దొంగతనం చేశారు.

అలాగే ఉదండాపురం గ్రామంలో జూలై నెల 25న రాత్రి హోటల్, ఇంజనీరింగ్ షాపులో పైకప్పు రేకులు తొలగించి ఆయా షాపుల్లో పదివేల రూపాయల వరకు దొంగిలించినట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 2న ఎర్రవల్లి చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. కర్నూల్ నుంచి పెబ్బేరు వైపు ఆటో వెళుతుండగా పోలీసులను చూసి పారిపోతుండగా వారిని పట్టుకుని విచారించారు. ఆయా గ్రామాలతో పాటు ఫిబ్రవరి, మార్చి నెలల్లో శాంతినగర్, అయిజ, ఉండవల్లి, మల్దకల్ మండలాల్లో సైతం దొంగతనాలు చేసినట్లు వారు ఒప్పుకున్నట్లు ఎస్సై తెలిపారు.

నిందితులు గూడూరు మండలం శనగండ్లకు చెందిన జార్జి, కడప జిల్లా గుడ్లపల్లికి చెందిన రెడ్డి శేఖర్, కర్నూల్‌కు చెందిన రవిలను పట్టుకొని కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. వారి నుంచి ఆటో, రూ.41 వెయ్యి, 30 కేజీల రాగి రేకు,15 కేజీల ఇత్తడి రేకులను స్వాధీనం చేసుకోగా, ఒకరు పరారీలో ఉన్నారన్నారు. కేసుకు సంబంధించి ఏఎస్సై రేపల్లె సుధాకర్, కానిస్టేబుళ్లు మహేశ్, మన్సూర్‌పాషా, నజీర్, పవిత్రలు సహకరించినట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

పోలీసుల అదుపులో విద్యుత్ తీగల దొంగ

మిడ్జిల్, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండల కేంద్రానికి కృష్ణయ్య అనే వ్యక్తి విద్యుత్ తీగలను చోరీ చేసి అందులో ఉన్న కాపర్ తీగలను తీసుకొని వెళుతుండగా రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ నారాయణ్‌రెడ్డి ఆదివారం తెలిపారు. కాగా, అదే గ్రామానికి చెందిన రైతు వెంకటరాములు వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ తీగలు చోరీకి గురికాగా రైతులు వెతుకుతుండగా కృష్ణయ్య కాపర్ తీగలు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. కృష్ణయ్యను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ నారాయణ్‌రెడ్డి తెలిపారు.

నీటి గుంతలో పడి యువకుడి మృతి

- కర్ణాటకలోని అజిలాపూర్ గ్రామంలో ఘటన


గణేష్ (ఫైల్)

మాగనూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మాగనూరు మండలం ఉజ్జల్లి గ్రామానికి చెందిన గణేష్ (28)శనివారం కర్ణాటకలోని అజిలాపూర్ గ్రామంలో కూలి పనికి వెళ్లి ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. రోజు మాదిరి కర్ణాటకలో అజిలాపూర్ గ్రామానికి కూలీలతో కలిసి నారు వేసేందుకు వెళ్తుండేవాడు. శనివారం కూలీ పనులు ముగించుకొని కాళ్లు, చేతులు శుభ్రం చేసుకునేందుకు నీటి గుంత వద్దకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో నీటి గుంత వద్ద వెళ్లి చూడగా చెప్పులు, సెల్‌ఫోన్ ఉండగా గణేష్ నీటి గుంతలో పడి ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. చీకటి పడటంతో ఎవరూ కూడా నీటి గుంతలో దిగే సాహసం చేయకపోవడంతో ఉదయం ఇట్టి విషయంపై కర్ణాటక రాష్ట్రం సైదాపూర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు రెస్క్యూ టీంతో నీటి గుంతలో వెతకగా గణేష్ మృతదేహం లభించినట్లు తెలిపారు. గణేష్‌కు 5 నెలల క్రితం వివాహం అయినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం కర్ణాటకలోని సైదాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. తండ్రి పాపయ్య ఫిర్యాదు మేరకు కర్ణాటక పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ప్రమాదం

రేవల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని కేశంపేట గ్రామంలో బంధువుల దశదిన కర్మకు నాగర్‌కర్నూల్ మండలంలోని సల్కరిపేట గ్రామానికి చెందిన సుధాకర్ వెళ్తుండగా కేశంపేట గ్రామ శివారులో బైకు అదుపుతప్పి కింద పడ్డాడు. కన్నుకు, కాళ్లు, చేతులకు దెబ్బలు తగిలి రక్తం వస్తుండగా బాటసారులు 108కి ఫోన్ చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత


ఇసుక టిప్పర్‌ను పట్టుకున్న పోలీసులు

దామరగిద్ద, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేస్తున్న ఇసుక టిప్పర్‌ను ఆదివారం నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల పరిధిలోని మద్దెల్‌బీడ్ గ్రామ శివారులో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. నారాయణపేట మండలం శాసన్‌పల్లి గ్రామానికి చెందిన టిప్పర్ యజమాని భగవంతు, డ్రైవర్ తిప్పగేరి నరేష్ అనే వ్యక్తి మక్తల్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా మద్దెల్‌బీడ్ శివారులో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించి డ్రైవర్, ఓనర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నీటిగుంతలో వ్యక్తి మృతదేహం లభ్యం

జడ్చర్ల, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం వల్లూరు గ్రామ సమీపంలోని ఉదండాపూర్ రిజర్వాయర్‌లోని నీటి గుంతలో ఆదివారం కుళ్లిన గుర్తుతెలియని వ్యక్తి(45) మృతదేహం లభ్యమయ్యింది. జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివారల మేరకు... నీటిగుంతలో చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు దాంట్లో పడి మృతి చెందాడు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, వారం రోజుల క్రితం మృతి చెంది ఉంటాడని వివరించారు. కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేపడున్నట్లు సీఐ తెలిపారు.

డ్రాగన్ ఫ్రూట్స్..
లాభాలు ఫుల్లు!



తోటలో కాసిన డ్రాగన్ ఫ్రూట్స్‌ను చూపిస్తున్న రైతు గోలి శేఖర్‌రెడ్డి

- 4 ఎకరాల్లో సాగు - రూ. 12 లక్షల ఆదాయం

చారకొండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం అనుకూలించక పెట్టుబడులు విపరీతంగా పెరగడం.. ఆశించిన దిగుబడులు రాక రైతులు అల్లాడి పోతున్నారు. కూలీల కొరతతో సేద్యం అంటేనే అమ్మో అనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి తరుణంలో నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని శేరిఅప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు మాజీ సర్పంచ్ గోలి రంగారెడ్డి, గోలి శేఖర్‌రెడ్డి ఇద్దరు అన్నదమ్ములు. పింక్ కలర్ డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేస్తూ లాభాలను ఆర్జిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచారు.

రైతులు గోలి రంగారెడ్డి, గోలి శేఖర్‌రెడ్డి తమకున్న 4 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగు చేస్తున్నారు. 2020 సంవత్సరం జనవరి నెలలో మొదటగా 2 ఎకరాలు, 2022 జనవరిలో మరో 2 ఎకరాలు డ్రాగన్ ఫ్రూట్ తోటను సాగుచేస్తున్నారు. 4 ఎకరాల్లో రూ. 4 లక్షలు ఖర్చుచేసి పైపులైను, డ్రిప్ సిస్టమ్‌ను అమర్చుకున్నారు. ఎకరానికి 400 కడీల చొప్పున 4 ఎకరాలకు 1600 కడీలను ఏర్పాటు చేసుకున్నారు. ఒక్కొక్క కడీకీ రూ. 800 ఖర్చు చేసి తమ వ్యవసాయ పొలంలోనే సిమెంట్‌తోనే తయారు చేయించారు. పొలంలో నాటిన ఒక్కొక్క కడీకి మొదట 4 మట్టలను నాటారు. కర్ణాటకలోని తుంగభద్ర సమీపంలో బళ్లారి జిల్లాలోని హోస్పేట్ నియోజకవర్గం నుంచి పింక్ డ్రాగన్ ఫ్రూట్ ఒక్కో మట్టకు రూ. 50 వెచ్చించి 3200 మట్టలను తీసుకొచ్చి సాగుచేస్తున్నారు. 2020 జనవరిలో రెండు ఎకరాల్లో పెట్టిన డ్రాగన్ ఫ్రూట్స్ మట్టలు 2021 మే నెలలో పూత దశకు వచ్చి జూన్ నుంచి నవంబరు వరకు కాపు కాసింది. మొదటి కాపులోనే ఒక్కో చెట్టుకు దాదాపు 20 డ్రాగన్ ఫ్రూట్స్(పండ్లు) వచ్చాయి. రెండు ఎకరాల్లో సుమారుగా 13 టన్నులు వచ్చింది. 2020లో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోట నుంచి కొన్ని మట్టలను తీసి వాటిని 2022 జనవరిలో మరో రెండు ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం 4 ఎకరాల్లో జూన్, జూలై నెలల్లో డ్రాగన్ ఫ్రూట్స్ వచ్చాయి. 25 టన్నుల దిగుబడి వచ్చింది. పెట్టుబడి పోనూ రూ. 12 లక్షలు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం మళ్లీ 4 ఎకరాల్లో తోట పూత పట్టింది. మరో రెండు నెలల్లో పండ్లు కోతకు వస్తాయని చెపుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ తోట పూత కొచ్చిన దశ నుంచి పండ్లు తీసేంత వరకు కూలీలు తప్పనిసరిగా అందుబాటులే ఉండాలని ఆ రైతులు చెపుతున్నారు.

వ్యవసాయశాఖ అధికారులు స్పందించి సలహాలు, సూచనలు, అవగాహన కల్పిస్తే మరింత దిగుబడి వచ్చే అవకాశం ఉంది.

● మట్ట బలానికి..

డ్రాగన్ ఫ్రూట్ మట్టలు నాటేటప్పుడు వాటి ఎదుగుదల కోసం వాటి మధ్య పశువుల ఎరువును పోసి డ్రిప్ సిస్టమ్ ద్వారా న్యూట్రన్స్ మందును అందించాలి. ప్రతీ మూడు నెలలకొకసారి మట్టల మొదట పెరిగిన కలుపును తప్పనిసరిగా తీసివేయాలి. మొదటి కాపు వచ్చేవరకు తోటలో అంతర్గత పంటలను వేసుకోవచ్చు. పంటసాగు చేస్తే 15ఏళ్ల వరకు ఉంటుంది. డ్రాగన్‌ఫ్రూట్‌లో పింక్, వైట్, ఎల్లో రకాలుంటాయి.

● ఒక విడతలోనే సబ్సిడీ



డ్రాగన్ ఫ్రూట్స్ పంటకోసం ఉద్యానవన శాఖకు దరఖాస్తు చేసుకొన్న తరువాత అధికారులు వచ్చి చూసివెళ్లారు. ఒక విడతలో ఉద్యానవన శాఖ నుంచి రూ. 70 వేలు మాత్రమే సబ్సిడీ వచ్చింది. మూడేళ్ల వరకు సబ్సిడీ వస్తుందని చెప్పిన అధికారులు ఒక విడత సబ్సిడీ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎన్నిసార్లు అధికారులను అడిగినా ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. ఇప్పటికైనా ఉద్యానవన అధికారులు స్పందించాలి.

- గోలి రంగారెడ్డి , రైతు, మాజీ సర్పంచ్, శేరిఅప్పారెడ్డిపల్లి, చారకొండ మండలం

● ప్రస్తుతం మార్కెట్‌లో రేటు తగ్గింది



ప్రస్తుతం మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్స్‌కు రేటు తగ్గింది. ఇది వరకు డ్రాగన్ ఫ్రూట్స్‌ను గుజరాత్, మహారాష్ట్రలోని నాసిక్, తమిళనాడులోని కోయంబత్తూర్, బెంగళూర్, హైదరాబాద్‌కు ఎగుమతి చేసి మార్కెట్‌లో కేజీ పండుకు రూ. 120 నుంచి 150 మధ్య విక్రయించేది. ప్రస్తుతం మార్కెట్‌లో రేటు తగ్గడంతో హైదరాబాద్‌లోని బాటసింగారం ఫ్రూట్ మార్కెట్‌లో కేజీ పండుకు రూ. 70 నుంచి 80 వరకు విక్రయిస్తున్నాం.

- గోలి శేఖర్‌రెడ్డి, రైతు, శేరిఅప్పారెడ్డిపల్లి, చారకొండ మండలం

రోడ్డెక్కిన నిర్వాసితులు

» బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్

» రాస్తారోకోలతో స్తంభించిన రాకపోకలు

నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులు రోడ్డెక్కారు. బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేపట్టారు. దీంతో గంటల పాటు రాకపోకలు స్తంభించి, ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. రిలే దీక్షలు చేస్తున్నా, కలెక్టరేట్ ముట్టడి చేసినా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని పలువురు నాయకులు విమర్శించారు.



మక్తల్ అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న పేట-కొడంగల్ భూ నిర్వాసితులు

భూ నిర్వాసితుల పట్ల ప్రభుత్వం మొండివైఖరి

నారాయణపేటటౌన్/దామరగిద్ద/మక్తల్/ఊట్కూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం అందించాలని కోరుతూ నారాయణపేట బస్టాండ్ రోడ్డుపై ఆదివారం గంట పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ గత 20 రోజులుగా భూ నిర్వాసితులు జిల్లా కేంద్రంలో రిలే దీక్షలు చేస్తున్నా, కలెక్టరేట్ ముట్టడి చేసినా కూడా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వం ఇస్తామన్న ఎకరానికి రూ. 14 లక్షలు ఆమోదయోగ్యం కాదని, ఆ డబ్బుతో మరో భూమి కొనే పరిస్థితి లేదన్నారు. ప్రాజెక్టులకు భూములు ఇస్తున్న భూ నిర్వాసితులకు అన్యాయం చేయొద్దని హితవు పలికారు. 2013 చట్టాన్ని అమలు చేసి భూ నిర్వాసితులను ఆదుకోవాలని కోరారు. పెరవల్ల, సింగారం గ్రామ నాయకులు ఆంజనేయులు, హనుమంతు, సత్యనారాయణగౌడ్, ఎస్ఎఫ్ఐ నాయకులు నరహరి, భాను, పవన్, పాల్గొన్నారు. ఈ రాస్తారోకో బందోబస్తుగా నారాయణపేట మండల రూరల్ ఎస్ఐ రాముడు, పట్టణ ఏఎస్ ఆంజనేయులు, అంజిలయ్య పాల్గొన్నారు.

భూసేకరణ ఆపాలని రాస్తారోకో

భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దామరగిద్ద అంబేడ్కర్ చౌరస్తాలో జరిగిన నిర్వాసితుల రాస్తారోకోలో మాట్లాడారు. ప్రభుత్వం పునరాలోచించి బహిరంగ మార్కెట్ ధరను పరిగణలోకి తీసుకొని ఎకరానికి రూ. 50 లక్షలు తగ్గకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జోషి, మొగులప్ప, శ్రీనివాస్‌రెడ్డి, నర్సిరెడ్డి, చంద్రశేఖర్, అశోక్, నారాయణ, బాల్‌రెడ్డి, కుమ్మరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని...

మక్తల్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సంఘం నాయకులు రవీందర్‌రెడ్డి, గోవిందరాజులు మాట్లాడుతూ పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోయే రైతులకు బహిరంగ మార్కెట్ ప్రకారం ధర నిర్ణయించాలన్నారు. భూ నిర్వాసితులు పుంజనూరు అంజనేయులు, కేశగౌడ్, రవీందర్‌రెడ్డి, గజ్జలప్ప, సత్యనారాయణగౌడ్, నారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, హన్మంతు, క్రిష్ణ, అశోక్‌గౌడ్, సోమన్నరాజు, వెంకట్‌రెడ్డి, బుచ్చన్న పాల్గొన్నారు.

స్తంభించిన నారాయణపేట- మక్తల్ రోడ్డు

రైతులకు బహిరంగ మార్కెట్ ధర ప్రకారం న్యాయబద్ధమైన వాస్తవ నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భూ నిర్వాసిత రైతులు నారాయణపేట- మక్తల్ రోడ్డుపై ఊట్కూర్ చెక్‌పోస్టు వద్ద బైటాయించారు. రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్తారోకోను ఉద్దేశించి సింగిల్ విండో అధ్యక్షుడు ఎం.బాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు అరవింద్‌కుమార్, మాజీ సర్పంచ్ ఎం.భాస్కర్‌లు మాట్లాడారు. రైతులు బైటాయించి గంటపాటు రాస్తారోకో చేయడంతో రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఊట్కూర్ ఎస్సై రమేష్ సంఘటనా స్థలికి చేరకుని నాయకులు, రైతులతో మాట్లాడి ప్రయాణికులకు ఇబ్బంది అవుతుండటంతో ఆందోళన విరమించాలని కోరారు. దీంతో వారు స్పందించారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, నాయకులు సంఘీభావం తెలిపారు. నాయకులు హన్మంతు, కుర్వ ఆశప్ప, కృష్ణయ్యగౌడ్, కిరణ్‌కుమార్, కోరం శివారెడ్డి, ఆనంద్రెడ్డి, నాసిర్ ఖాన్, షేక్ షమీ, గోపాల్‌రెడ్డి, ధర్మరాజుగౌడ్, రాఘవేందర్‌గౌడ్, దంతన్‌పల్లి, శివారు రైతులు పాల్గొన్నారు.

హుండీని ధ్వంసం చేసిన దొంగలు


గుడిలో హుండీ ఎత్తుకెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు

మల్దకల్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలోని మద్దెలబండ గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి హుండీని ఎత్తుకెళ్లారు. గుడి బయటకు తీసుకువచ్చి హుండీని ధ్వంసం చేసి అందులోని నోట్లను మాత్రమే తీసుకెళ్లారని ఆలయ అధ్యక్షుడు సిద్దయ్య తెలిపారు. ఈ ఘటనపై మల్దకల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నందికర్ తెలిపారు.

విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే


బంగారు పతకాలు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ అండర్-23 విభాగంలో ఈ నెల 2న హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో జిల్లాలోని ధన్వాడ మండలానికి చెందిన నాగలక్ష్మి, గీతలు బంగారు పతకాలు సాధించారు. దాంతో ఆదివారం ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి హైదరబాద్‌లోని తన నివాసానికి ఇద్దరు విద్యార్థినులను పిలిపించి అభినందించారు. త్వరలో జార్ఖండ్‌లో ఈనెల 21 నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. 55 కేజీల విభాగంలో నాగలక్ష్మి, 50 కేజీల విభాగంలో గీతలు బంగారు పతకం సాధించారని, ఈ పతకాలు సాధనలో చక్కటి శిక్షణ ఇచ్చిన కోచ్ శ్రీనివాసులును ఎమ్మెల్యే అభినందిస్తూ క్రీడాకారులకు ఎల్లప్పుడు అండగా ఉంటానన్నారు.

ఒరిగిన స్తంభం తొలగించి..



కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేసిన విద్యుత్‌శాఖ అధికారులు

బిజినేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని మంగనూర్‌లో మహబూబ్‌నగర్, శ్రీశైలం ప్రధాన రహదారి పక్కనే ఒరిగి ఉన్న 11కేవీ విద్యుత్ లైన్ స్తంభంతో పొంచి ఉన్న పెనుప్రమాదం అని 'ఆంధ్రజ్యోతి'లో జూలై 28న ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి' పత్రికలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం గురించి వెలుగులోకి తీసుకరావడం వల్లే అధికారులు స్పందించి తొలగించారని సంతోషం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తి

● 400 యూనిట్లను అధిగమించిన ఉత్పత్తి


జల విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం ఉత్పత్తి కేంద్రంలోకి వెళ్తున్న నీరు

ఆత్మకూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నిరంతరాయంగా జల విద్యుత్ ఉత్పత్తిని చేపడుతున్నట్లు ఉత్పత్తి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ తెలిపారు. గడిచిన 24 గంటల్లో ఎగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ప్రారంభించి 2.702 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 186.214 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే దిగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్లను ప్రారంభించి గడిచిన 24 గంటల్లో 3.060 మిలియన్ యూనిట్లను చేపట్టామన్నారు. అలాగే ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు 221.756 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు ఆయన తెలిపారు. ఎగువ నుంచి వరద వస్తున్న కారణంగా నిరంతరాయంగా విద్యుత్ ఉత్పత్తిని చేపడుతున్నామని ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభించిన నాటి నుంచి ఆగస్టు మొదటి వారంలోపే 400 యూనిట్లను అధిగమించడం ఇదే మొదటిసారి అని ఆయన గుర్తు చేశారు. వరద ఇలాగే కొనసాగితే నిర్దేశించిన లక్ష్యాన్ని తొందరగానే అధిగమించే అవకాశం ఉందని అన్నారు.

గవర్నర్‌చే వనపర్తి విద్యార్థికి అవార్డు


గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న భార్గవి చారి

వనపర్తి విద్యా విభాగం, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఆదివారం జరిగిన 55 కాన్వకేషన్‌లో భాగంగా వనపర్తి పట్టణానికి చెందిన జి. యాదగిరి చారి, విజయ హైమావతి దంపతుల కుమార్తె జి. భార్గవి చారి పలు మెడల్స్ సాధించారు. యూనివర్సిటీకి సంబంధించిన ఓవరాల్ కేటరిగి విభాగంలో 4 గోల్డ్ మెడల్స్, ఫామ్ విషనరీ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి 2 డిపార్ట్మెంట్‌లో 2 గోల్డ్ మెడల్స్ సాధించారు.

ఈ పతకాలను గవర్నర్ ఆఫ్ తెలంగాణ, చాన్సలర్ ఆఫ్ యూనివర్సిటీ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అందుకున్నారు. ఆ కార్యక్రమంలో డాక్టర్ మంగిలాల్ జాట్ (డైరెక్టర్ ఆఫ్ జనరల్ ఐసిఎఆర్ ఢిల్లీ), వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్డాస్ జానయ్య, తదితర యూనివర్సిటీ ప్రముఖులు, యాజమాన్యం, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రిటైర్డ్ టీచర్‌కు పరామర్శ

తెలకపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజుల క్రితం గుండె ఆపరేషన్ అయ్యి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న రిటైర్డ్ టీచర్ కొమ్ము పర్వతాలును బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర యువ నాయకుడు డాక్టర్ నాగం శశిధర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ జిల్లా సీనియర్ నాయకులు అర్థం రవి, ఐతోల్ లక్ష్మయ్య, తిరుపతి రెడ్డి, బోనాసి లక్ష్మయ్య, కురుయ్య, సుబ్బయ్య, భీమయ్య, వెంకటేష్, విష్ణు, భీముడు, అహ్మద్, రాము, తెలకపల్లి మండల నాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం తిరుగు ప్రయాణానికి బందోబస్తు

చారకొండ, ఆగస్టు 3(ఆంధ్రజ్యోతి) : జిల్లా పర్యటనను ముగించుకొని తిరుగుప్రయాణమైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు మండల కేంద్రంలో ఆదివారం వెల్దండ, కల్వకుర్తి సీఐలు విష్ణువర్ధన్‌రెడ్డి, నాగార్జున ఆధ్వర్యంలో ఎస్‌ఐలు శంషుద్దీన్, కురుమూర్తి, మాధవరెడ్డి, మహేష్ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

పెయింటర్స్ సంఘం ఎన్నిక

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : వివేకానంద పెయింటర్స్ సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.శివ, కార్యదర్శిగా ఎం.చక్రవర్తి, సహాయ కార్యదర్శులుగా ఎ.నిరంజన్, రహీం, కోశాధికారిగా జి.నాగరాజు, ప్రచార కార్యదర్శిగా కె.శేఖర్ సభ్యులుగా ఎ.కృష్ణ, శివరాం, ఎం.రాజు, కె.రమేష్, జె.అనంతయ్య, మల్లేష్, సలహాదారులుగా ఆర్.నందు, సీ.హెచ్. శంకర్, గౌరవ అధ్యక్షులుగా ఎం.శ్రీను, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.ఆనంద్‌ను ఎన్నుకున్నారు.

మునిసిపల్ కమిషనర్‌కు వినతి

కందనూలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడ, ఎండబెట్ల, 17వ వార్డులోని సమస్యల గురించి మునిసిపల్ కమిషనర్ నాగిరెడ్డికి ఆదివారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. బీజేపీ నాగర్‌కర్నూల్ పట్టణ అధ్యక్షుడు చెవ్వ ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మునిసిపల్ కమిషనర్ కోరినట్లు తెలిపారు. మునిసిపల్ కమిషనర్‌ను బీజేపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పోల్‌దాసు రాము, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బుసిరెడ్డి సుధా కర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా మాజీ ఉపాధ్యక్షుడు పస్తం బాబు, పట్టణ జనరల్ సెక్రటరీ వారధి శ్రీను, సెక్రటరీ రాచూరి బాలరాజు, నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ కోసం పని చేస్తున్న వారికి పదవులు ఇవ్వాలి

- డీసీసీ ప్రధాన కార్యదర్శి లక్ష్మారెడ్డి

వంగూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఎంతో కాలంగా పార్టీ కోసం పని చేస్తున్న వారిని గుర్తించి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇవ్వాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి కాంగ్రెస్ అధిష్టానాన్ని కోరారు. ఆదివారం కొండారెడ్డిపల్లిలో విలేకర్ల తో మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టి అధికారం లోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్‌లో కొత్తగా చేరిన వారితో పాత నాయకులకు పలు గ్రామాల్లో సఖ్యత కరువైందని అన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్ష పదవి తనకు ఇవ్వాలని లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా కాంగ్రేస్ పెద్దలను కోరారు.

దండు నర్సింహకు క్షమాపణ చెప్పాలి

- మాదాసి కురువ సంఘం నాయకులు

కొల్లాపూర్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ నియోజకవర్గంలో శనివారం జరిగిన కాంగ్రెస్ బహిరంగ సభలో సభ అధ్యక్షునిగా వ్యవహరించిన పెద్దకొత్తపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నరసింహకు ఎంపీ మల్లు రవి క్షమాపణ చెప్పాలని మాదాసి, మాదారి కురువ సంఘం నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. కొల్లాపూర్‌లో జరిగిన సభకు అధ్యక్షత వహించిన నర్సింహ, స్టేజీ మీద ఉన్న నాయకుల సూచనల మేరకు సమయం లేదని ఒక స్లిప్ ఎంపీకి చూపించగా నిండు సభలో అగౌరవపరుస్తూ 'నిన్ను ఎవరు స్టేజీ ఎక్కించింది, నీవు ఎవరు నాకు చెప్పడానికి' అని మాట్లాడి అవమానపరిచారని వారు అన్నారు. ఆదివారం కొల్లాపూర్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాదాసి, మాదారి కురువ సంఘం నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లయ్య, బీరయ్య, ధర్మయ్య, చంద్రయ్య, రాంబాబు, ఓరే వెంకటస్వామి, ఓరే మల్లయ్య, బెల్లె బాలయ్య, దుబాయ్ స్వామి, కొల్లె తిరుపతయ్య, కొల్లె ఈశ్వర్, నాగరాజు, చందు, తరుణ్, రాజేష్, శివ, కర్ణ తదితర నాయకులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల మంజూరు పత్రాల పంపిణీ

పెంట్లవెల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మల్లేశ్వరం గ్రామంలో ఆదివారం 50 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డు మంజూరు పత్రాలు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరసింహయాదవ్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్‌ఎస్ 10 సంవత్సరాల కాలంలో ఒకరికి కూడా రేషన్ కార్డు మంజూరు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అర్హులైన ప్రతీ ఒక్కరికి రేషన్ కార్డులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్విండో డైరెక్టర్ బాలరాజు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బోగ్యం నరసింహనాయుడు, తిరుపాటి నాగరాజు, కారంగి ఈశ్వరయ్య, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, పసుల రాముడు, అంకుల్ శ్రీను, జ్ఞానేంద్రుడు, నరసింహ, కురుమయ్య, వంశీ పాల్గొన్నారు.

కంపుకొడుతున్న గొల్లగేరి

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్



వార్డులో పేరుకుపోయిన మురుగు

- సమస్యల నిలయంలో రెండవ వార్డు
- అస్తవ్యస్తమైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు
- చెత్తాచెదారంతో దుర్గంధం వెదజల్లుతోన్న కాలనీ

కందనూలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని రెండవ వార్డు చెత్తాచెదారం, మురుగునీటితో దుర్గంధం వెదజల్లుతూ దర్శనమిస్తుంది. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా కావడంతో గొల్లగేరిలో మురుగునీరు రోడ్లపైకి ఓపెన్ ప్లాట్లలో నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. కాలనీలో శిథిలావస్థలో ఉన్న డ్రైనేజీల్లో మురుగు నీటిలో మట్టి కూరుకుపోయి నీటి నిల్వతో దోమల, బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీకి చెత్తబండి వారానికి ఒకసారి కూడా రాకపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. తాగునీటి సమస్య అస్తవ్యస్తంగా మారిందని నాలుగు రోజులకొకసారి నీరు విడుదల చేస్తే అవి కూడా సక్రమంగా సరిపోవడం లేదని కాలనీవాసులు పేర్కొన్నారు. గొల్లగేరి సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టూ తీగలతో అల్లుకుపోయి ట్రాన్స్‌ఫార్మర్ కన్పించకుండాపో యింది. దీంతో ప్రమాద భరితమని తెలిసి కూడా కాలనీవాసులు ఏం చేయలేకపోతున్నా మని పేర్కొన్నారు.



శిథిలావస్థలో మురుగు కాల్వ



వార్డులో మురుగునీరు

డ్రైనేజీ, అంతర్గత రోడ్లు నిర్మించాలి



కాలనీలో మురుగు నీరు డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కూడా అస్తవ్యస్తంగా మారి నీరు ఖాళీ ప్లాట్లలోకి వచ్చి దుర్గంధం వెదజల్లుతుంది. తక్షణమే కాలనీలో తాగునీటి సరఫరా అందించి డ్రైనేజీలను సరి చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

- గొల్ల లక్ష్మమ్మ, రెండవ వార్డు కాలనీవాసి

అధికారులు పట్టించుకోవడం లేదు



వార్డులోని సమస్యలు మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ అస్తవ్యస్తంగా మారిందని దీంతో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోయిందని పేర్కొన్నారు. మురుగు కాల్వలు శిథిలావస్థకు చేరుకుని మట్టి కూరుకుపోయిందని పేర్కొన్నారు. తక్షణమే మురుగు కాల్వల నిర్మాణం చేపట్టి మట్టిని తొలగించి మురుగునీరు సరఫరాకు చర్యలు తీసుకోవాలి.

- మాజీ కౌన్సిలర్ కొత్తసుమలత గంగాధర్

ఉచిత బియ్యం ఇస్తున్నది బీజేపీ ప్రభుత్వం

- నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు



తాడూరులో పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నరేందర్‌రావు

తాడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండలంతో పాటు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేషన్‌కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి ఉచిత రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నది బీజేపీ ప్రభుత్వమని పార్టీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ అనే కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుక చిలుక సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్‌రావు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త ఒక సైనికుడిలా మారి జిల్లా వ్యాప్తంగా ఎక్కువ గ్రామపంచాయతీల్లో బీజేపీ జెండాను ఎగురవేయాలని దిశా నిర్దేశం చేశారు. పేద ప్రజలకు ప్రతీనెల ఉచిత బియ్యం, భూమి ఉన్న ప్రతీ రైతుకు కిసాన్ సమ్మాన్ నిధి నుంచి 2వేల రూపాయలు ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తాడూరు మండల ఇన్‌చార్జి నాగేందర్‌గౌడ్, బీజేపీ యువ మోర్చా జిల్లా కార్యదర్శి ధన్నేజు నరేష్ చారి, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, మండల సెక్రటరీ బాలస్వామి, అనంత రాములు, మస్తాన్, తాడూరు గ్రామ నాయకులు చందు, వివిధ గ్రామాల నాయకులు నాగయ్యగౌడ్, చెన్న చంద్రయ్య, కృష్ణ, పరశురాములు పాల్గొన్నారు.

● వంగూరు : బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోకవర్గ ఇన్‌చార్జి పోతుగంటి భరత్ కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని రంగాపూర్‌లో ఓటర్ చైతన్యం కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కార్యక ర్తలు సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, సైదులు, రామకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, నవీన్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, రాఘవేందర్, నరేందర్, భీమయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

● కల్వకుర్తి : కల్వకుర్తి పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణలో అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొండి వైఖరిని వీడి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుపర్చాలని డిమాండ్ చేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే ప్రత్యక్ష కార్యాచరణ

- టీజీఈజేఏసీ జిల్లా భవండ్ల వెంకటేష్



సమావేశంలో పాల్గొన్న టీజీఈజేఏసీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించపోతే ఈ నెల 15 తర్వాత ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఐక్యకార్యాచరణ సమితి (టీజీఈజే ఏసీ) జిల్లా అధ్యక్షుడు భవండ్ల వెంకటేష్ అన్నారు. ఆదివారంలో జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ భవనంలో టీజీఈజేఏసీ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు న్యాయంగా ఇవ్వాల్సిన బకాయిల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రావు, నాయకులు సత్యానారాయణరెడ్డి, శ్రీధర్‌శర్మ, శ్రీధర్‌రావు, వెంకట్, షర్ఫోద్దీన్, శ్రీధర్, సురేందర్‌రెడ్డి, మురళి, ఆర్.కృష్ణ, లక్ష్మీనరసింహరావు, నిరంజన్‌యాదవ్, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి



కాలనీలోని సమస్యలపై కౌన్సిలర్ సునీతతో కలిసి వినతిపత్రం అందజేసిన కాలనీవాసులు

అచ్చంపేటటౌన్ : న్యూ వెంకటేశ్వర కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ఆదివారం కాలనీవాసులు సమావే శమై ప్రధాన సమస్యలపై చర్చించుకున్నారు. వర్షాకాలం కావడం వల్ల నూతనంగా ఏర్పడిన కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతుడడంతో దోమల బెడద అధికమవుతుంది. అంతర్గత రోడ్లు లేకపోవడం వల్ల కాలనీకి వచ్చేపోయే వారికి ఇబ్బందిగా మారింది. ఈ నెపథ్యంలో కాలనీలోని ప్రధానమైన సమ్యలు కౌన్సిలర్ సునీత దృష్టికి తీసుకెళ్లగా కాలనీ వాసులు ఆమెతో కలిసి ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజి నిర్మాణాల కోసం బడ్జెట్ కేటాయించామని, న్యూ వెంకటేశ్వర కాలనీలలో డ్రేనేజీలు ఏర్పాట్ల కోసం రాతపూర్వకంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు జైపాల్, రమేష్, రామోజీ, వెంకటేష్ గౌడ్, నరేష్, అరవింద్, మల్లేష్, చందు, లోకేష్, మహేష్, రణధీర్, శంకర్, సీతారాం, ఆంజనేయులు, ప్రభాకర్, సూర్యం, సురేష్, కుమార్, రఘు, హరిలాల్ పాల్గొన్నారు.

అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్



పాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరిస్తున్న పత్తికొండ రాంరెడ్డి

బిజినేపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : అన్నా చెల్లెళ్ల అనుబంధానికి, ఆత్మీయతకు రక్షాబంధన్ ప్రతీక అని ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ కార్యవాహ పత్తికొండ రాంరెడ్డి అన్నారు. మండలంలోని పాలెంలోని ఆంజనేయ స్వామి ఆలయ ఆవరణలో ఆదివారం భక్తులతో కలిసి ఒకరికొకరు రాఖీలు కట్టుకొని రక్షాబంధన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోబుట్టువులకు ఎంతటి కష్టం వచ్చినా వెన్నంటే ఉంటామని, సోదరులు రక్షకట్టి ధైర్యం కల్పిస్తారని అన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఆలయ అర్చకులు వెల్దండ సురేష్ ఉన్నారు.

'ఎస్సీ రిజర్వేషన్‌ను 18 శాతానికి పెంచాలి'

తాడూరు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీల రిజర్వేషన్‌శాతాన్ని 15 నుంచి 18శాతానికి పెంచాలని బీఎంపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం విజయ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం వివిధ సంఘాలు, దళిత నాయకులతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. విజయ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెరిగిన ఎస్సీల జనాభా అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని 15 నుంచి 18శాతానికి పెంచాలని ఈనెల 3 నుండి 10వ రకు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ వ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాలమూరు వలస లేబర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాకీ బాలరాజు, దళిత దండు రాష్ట్ర కార్యదర్శి ఎత్తపు చంద్రస్వామి, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి చింత సత్తి, భారత్ ముక్తి మోర్చా నాయకులు మీసాల మహేందర్, ఎర్రోళ్ల రవి పాల్గొన్నారు.

10న సర్వాయి పాపన్నగౌడ్ జయంతి

- పెద్దకొత్తపల్లిలో వాల్‌పోస్టర్లు విడుదల చేసిన జైగౌడ ఉద్యమ నాయకులు



సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వారోత్సవాల వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న సంఘం నాయకులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఈనెల 10న జరిగే మహారాజ్ పాపన్న గౌడ్ జయంతి జాతీయ వారోత్స వాలను ఘనంగా జరుపుకుందామని జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తమటం వెంకటస్వామిగౌడ్, పెద్దకొత్తపల్లి మండల జైగౌడ ఉద్యమం అధ్యక్షుడు తమటం యుగంధర్‌గౌడ్‌లతో కలిసి గుండ్రాతి నారాయణ గౌడ్ పాపన్నగౌడ్ జయంతి జాతీయ వారోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెద్దకొత్తపల్లి జైగౌడ ఉద్యమం నాయకులు, గౌడ సంఘం నాయకులు, కొల్లాపూర్ నియోజకవర్గం జైగౌడ ఉద్య మం ప్రధాన కార్యదర్శి తమటం రామన్‌గౌడ్, మండల జైగౌడ ఉద్యమం నాయకులు వంగ లింగస్వామిగౌడ్, కాటమోని శ్రీధర్‌గౌడ్, బొడ్డు మోహన్‌గౌడ్, లింగాల చక్రధర్‌గౌడ్ (జైగౌడఉద్యమం ప్రధాన కార్యదర్శి) నిరంజన్ పాల్గొన్నారు.

ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

- మాదాసి, మాదారి కుర్వ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగ మల్లయ్య డిమాండ్



పెద్దకొత్తపల్లిలో మాదాసి కుర్వ సంఘం సభ్యులను సన్మానిస్తున్న సంఘం జిల్లా నాయకులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : మాదాసి కురువ, మాదారి కురువలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఓరే నాగమల్లయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం పెద్దకొత్తపల్లిలో మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బెట్టరి నాగరాజు, గౌరవ అధ్యక్షుడుగా బాలపీరు, ప్రధాన కార్యదర్శి కొల్లే ఈశ్వర్, ఉపాధ్యక్షులుగా బీరయ్య, రాచూరి కృష్ణయ్య, కార్యదర్శిగా నాగమల్లయ్య, కోశాధికారిగా కొల్లె తిరుపతయ్య, సహాయ కార్యదర్శులుగా శారద మల్లేష్, మల్లయ్య, మీడియా ఇన్‌చార్జి శారద రాముడు, చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, ఆగస్టు 3 (ఆంధజ్యోతి) : విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో గిరిజన ఆదివాసి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లమల ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న గిరిజన ఆదివాసి ఉపాధ్యాయులు పాఠశాలలో విద్యార్థుల సంఖ్యపెంపునకు కృషి చేయాలన్నారు. పాఠశాల లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. పాఠశాలల నిర్వహణలో సమస్యలు, మౌలిక సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతి చెందిన విద్యార్థి కుటుంబానికి సాయం

- రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్ అందజేసిన ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



విద్యార్థి కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

వెల్దండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : గత శివరాత్రి పర్వదినాన మండలంలోని గుండాల అంబారామలింగేశ్వరస్వామి దేవాలయం కోనేరులో ప్రమాదవశాత్తు పడి ఇంటర్ విద్యార్థి పెరుమాండ్ల ఓమేష్ మృతిచెందాడు. ఈ మేరకు ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని మృతుడి కుటుంబానికి అండగా నిలిచి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షలు మంజూరు చేయించి, ఆ చెక్కును బాధితుని తల్లిదండ్రులు లక్ష్మి, రాములుకు ఆదివారం అందజేశారు. ప్రభుత్వం అన్నివర్గాల వారికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు పర్వత్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, రాజేశ్‌రెడ్డి, అరుణ్, అంజయ్య, లింగమయ్య, తిర్పతయ్య, అర్చకులు కృష్ణయ్య, నరహరి ఉన్నారు.

ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి : ఎమ్మార్పీఎస్

ఆలయ కోనేరులో పడి మృతిచెందిన విద్యార్థి పెరుమాళ్ల ఓమేష్ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు పోలే అశోక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పారదర్శకంగా ఉపాధ్యాయుల పదోన్నతులు

- జిల్లా విద్యాధికారి రమేశ్



జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను పరిశీలిస్తున్న డీఈవో రమేష్ కుమార్

నాగర్‌కర్నూల్ టౌన్, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా విద్యాధికారి రమేష్‌కుమార్ అన్నారు. ఆదివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో రమేష్‌కుమార్ ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లా నుంచి 39 మంది జీహెచ్ఎంలు, 109 మంది స్కూల్ అసిస్టెంట్లు, 22మంది పీఎస్‌హెచ్ఎంలు పదోన్నతులను అర్హులని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జడ్పీహెచ్ఎస్‌లలో 36, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 3 జీహెచ్ఎంలకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయుల జాబితాను ప్రాంతీయ విద్యాసంచాలకులకు పంపించామని పేర్కొన్నారు. అలాగే జిల్లాలో 138 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు సబ్జెక్టుల వారీగా ఉదోన్నతులు కల్పించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను జిల్లా విద్యాశాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మంగళవారం సెబ్జెక్టుల వారీగా పాఠశాలల ఖాళీల వివరాలతో ఉపాధ్యాయుల ప్రమోషన్ల తుది జాబితాను విడుదల చేస్తామని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, ఏసీ రాజశేఖర్‌రావు, కార్యాలయ పర్యవేక్షకులు నాగేందర్, ఎంఈవో భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు శెట్టి, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యదర్శికి ఘన సన్మానం



సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్‌ను సన్మానిస్తున్న ఆ పార్టీ సీనియర్ నాయకులు

పెద్దకొత్తపల్లి, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండీ ఫయాజ్‌ను ఆ పార్టీ జిల్లా నాయకులు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆదివారం దేవునితిర్మలాపూర్ గ్రామానికి వచ్చిన ఫయాజ్‌ను రాష్ట్ర సీపీఐ కార్యదర్శి వర్గ సభ్యులు బాలనరసింహ, దేవునితిర్మలాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ గడ్డిగోపుల ఉసేనయ్యలు సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూనాగర్‌కర్నూల్ జిల్లా ప్రజాసమస్యలపై సీపీఐ తరఫున రాజీలేనిపోరాటాలతో సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సీపీఐ జిల్లా కార్యదర్శి బాలనరసింహ, సీపీఐ నాయకులు కోళ్ల ఏసయ్య, టి.నరసింహ, శ్రీనివాసులు, ఎం.లక్ష్మీనారాయణ, లక్ష్మణ్‌స్వామి, సాయిలు, కరీం ప్రకాశ్, చింతలపల్లి కుర్మయ్య, ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంతో పెంపొందనున్న ఆప్యాయత

- ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుతోట మధుమోహన్



వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్‌లోని శ్రీరంగనాథస్వామి ఆలయ ఆవరణలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు జిల్లా కేంద్రం నుంచి తరలివెళ్తున్న ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగులు

కందనూలు, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ కుటుంబాల్లో ఆప్యాయతను పెంచుకోవడంతోపాటు సంస్కృతి సంప్రదాయాలను నిలబెట్టేందుకు ఆత్మీయ సమ్మేళనాలు ఎంతో దోహదం చేస్తాయని ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుతోట మధుమోహన్ అన్నారు ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న సుమారు 60 మంది కుటుంబ సభ్యులు అసోసియేషన్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలోని శ్రీరంగాపూర్ శ్రీ రంగ నాథస్వామి ఆలయ ఆవరనలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు జిల్లా కేంద్రం నుంచి తరలి వెళ్లినట్లు తెలిపారు. స్నేహితుల దినోత్సవాన్ని సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించుకునేందుకు తమ ఆత్మీయ సద్భుకు జడ్చర్ల గద్వాల, మహబూబ్‌నగర్, కల్వ కుర్తి, అచ్చంపేట, వనపర్తి నియోజకవర్గాల నుంచి ఆర్యవైశ్య ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ సభ్యులుపాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..



స్నేహితుని కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

వెల్దండ, ఆగస్టు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తమ చిన్ననాటి స్నేహితుని కుటుబానికి మిత్రులు అండగా నిలిచారు. మండల కేంద్రానికి చెందిన ఎండీ ఆసిఫ్ అనారోగ్యంతో గత నెలలో మృతిచెందాడు. దీంతో స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాము సమకూర్చిన 32వేల నగదును ఆదివారం ఆసిఫ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. భవిష్యత్తులో సైతం కుటుంబానికి అండగా ఉంటామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కొండల్‌యాదవ్, చంద్రకాంత్‌గౌడ్, సాయిబాబు, మల్లేష్, వెంకటేష్, శ్రీను, సద్దాం, ఆనంద్ తదితరులు ఉన్నారు.

● అచ్చంపేట : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాల్యమిత్రులు నేటితరం వరకు ఒకరినీ ఒకరు ఆప్యాయతలతో పలకరించుకొని ఆలింగణం చేసుకొన్నారు. ఫ్రెండ్‌షిప్ బాండ్‌లను కొనుక్కొని ఒకరికొకరు కట్టుకొని స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.